తెలుగు దినపత్రిక
ప్రభాత jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
17-04-2024
బుధవారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 241 | పేజీలు : 8 | వెల : 4



జయభేరి దినపత్రిక జయభేరి చానల్లో నికార్సైన జర్నలిస్టులుగా నిలబడాలనుకుంటున్నారా..
ఆసక్తి కలిగిన యువతీ యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
jayabherinews@gmail.com
jayabheridaily.com
+91 9391 544 889


## భద్రాద్రి సీతారాముల కల్యాణం
# లైవ్ పై సస్పెన్స్




✍ జయభేరి, భద్రాద్రి :

భద్రాద్రి సీతారాముల కల్యాణం ప్రత్యక్ష ప్రసారంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రత్యక్ష ప్రసారాలపై ఈసీ ఆంక్షలు విధించడంపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై ఈసీకి లేఖ రాసింది. కన్నుల పండుగగా జరిగే శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్నిటీవీలో వీక్షించే అవకాశం ఉందా? లేదా? అన్న అంశంపై సస్పెన్స్ కొనసాగుతోంది. దక్షిణ భారతదేశ అయోధ్యగా కొలుచుకునే భద్రాచల పుణ్య క్షేత్రంలో వైభవంగా జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకను ప్రత్యేక ప్రసారాల ద్వారా ప్రతి సంవత్సరం టీవీల్లో వీక్షించేవారు. కాగా లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యక్ష ప్రసారాలపై కేంద్ర ఎన్నికల సంఘం ఆంక్షలు విధించింది. ప్రత్యక్ష ప్రసారాలు నిలిపివేయాలంటూ నిబంధనలు విధించింది. ఈ క్రమంలో

...మిగతాది 2 లో

## ఈ ప్రభుత్వం ఏడాది కూడా
# ఉండేలా లేదు



✍ జయభేరి, సుల్తాన్‌పూర్ :

తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 2 సీట్ల కంటే ఎక్కువ రావని సర్వే రిపోర్టులు వస్తున్నాయని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ సీఎం బీజేపీలో కలిసే అవకాశం ఉందని కేసీఆర్ అన్నారు. సుల్తాన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన జహీరాబాద్, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గాల

...మిగతాది 2 లో




- సివిల్స్ ఫలితాల్లో సత్తా చాటిన తెలుగు తేజాలు
- దోనూరు అనన్య రెడ్డికి మూడో ర్యాంక్
- నందల సాయి కిరణ్- 27వ ర్యాంకు
- మేరుగు కౌశిక్- 82వ ర్యాంకు
- సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు
- తుది ఫలితాల్లో 1016 మంది ఎంపిక


యూపీఎస్సీ సివిల్స్2023 ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల్లో 50 మంది అభ్యర్థులు ర్యాంకులు సాధించారు. తెలంగాణకు చెందిన దోనూరు అనన్య రెడ్డి జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు సాధించారు.
యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్2023 తుది ఫలితాలు విడుదల అయ్యాయి. సివిల్స్ ఫైనల్ రిజల్ట్స్ లో తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు సత్తా చాటారు. సివిల్స్2023 ఫలితాల్లో తెలంగాణకు చెందిన దోనూరు అనన్య రెడ్డి ఆల్ ఇండియా మూడో ర్యాంకు సాధించారు. మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన అనన్య తన ఫస్ట్ అటెంప్ట్ లోనే మూడో ర్యాంకు సాధించారు. ఆల్ ఇండియా థర్డ్ ర్యాంకు రావడంపై అనన్య రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతో సివిల్స్ చదవాలని నిర్ణయించుకున్నానన్నారు. ఆంత్రోపాలజీకి మాత్రమే కోచింగ్ తీసుకున్నానని, రోజులు 12, 14 గంటలు చదివేదానినని ఆమె తెలిపారు.

## సివిల్స్ లో సత్తా చాటిన
# తెలుగు తేజాలు

✍ జయభేరి, హైదరాబాద్ :

సివిల్స్ ఫలితాల్లో మెరిసిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఈసారి దాదాపు 50 మందికి పైగా సివిల్ సర్వీసెస్ కు ఎంపికవటం పట్ల సీఎం హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు సాధించిన పాలమూరుకు చెందిన దోనూరు అనన్య రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్2023 తుది ఫలితాల్లో 1,016 మందిని ఎంపిక చేశారు. 180 మంది ఐఏఎస్ కు, 37 మంది ఐఎఫ్ఎస్ కు, 200 మంది ఐపీఎస్ కు ఎంపికయ్యారు. సెంట్రల్ సర్వీసెస్ గ్రూప్ఏ కేటగిరిలో 613 మంది, గ్రూప్‌బి సర్వీసెస్ లో 113 మందిని యూపీఎస్సీ ఎంపిక చేసింది. సివిల్స్ సర్వీసెస్2023 ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన 50 అభ్యర్థులు ర్యాంకులు సాధించారు. **సివిల్స్ 2023 ఫలితాల్లో మెరిసిన తెలుగు తేజాలు :** దోనూరు అనన్య రెడ్డి 3వ ర్యాంకు, నందల సాయి కిరణ్ 27వ ర్యాంకు, మేరుగు కౌశిక్ 82వ ర్యాంకు, ధీరజ్ రెడ్డి 173వ ర్యాంకు, అక్షయ్

...మిగతాది 2 లో



# క్రికెట్ బెట్టింగ్‌పై సైబరాబాద్ పోలీసుల ఉక్కుపాదం

- ఏకకాలంలో వేర్వేరు చోట్ల దాడులు
- ఐపీఎల్ సీజన్‌ను అడ్డంపెట్టుకుని హైదరాబాద్‌లో వేర్వేరు ప్రాంతాల్లో బెట్టింగులు నిర్వహిస్తున్న ముఠాలను సైబరాబాద్ పోలీసులు పట్టుకున్నారు.

✍ జయభేరి, హైదరాబాద్ :

క్రికెట్ బెట్టింగ్ పై ఉక్కుపాదం మోపుతున్న సైబరాబాద్ పోలీసులు, సోమవారం ఐదు ప్రాంతాల్లో దాడులు చేసి భారీ మొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్నారు. బెట్టింగులు నిర్వహిస్తున్న 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి తెలిపిన వివరాల ప్రకారం... సైబరాబాద్ SOT డీసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శంషాబాద్, మాదాపూర్, బాలానగర్,కూకట్ పల్లి, జీడిమెట్ల, దుండిగల్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. కూకట్ పల్లికి చెందిన పొందురి సురేష్ ఐపీఎల్ మ్యాచ్ ల పై ఆన్ లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు సమాచారం అందడంతో శంషాబాద్ SOT పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా సురేష్‌తో పాటు వికారాబాద్ జిల్లాకు చెందిన రామకృష్ణ రెడ్డిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఈ బెట్టింగ్ ముఠాలో ఒకరుగా ఉన్న రామాంజనేయులు అనే వ్యక్తి ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు కమిషనర్ అవినాష్ మహంతి తెలిపారు. ప్రధాన బెట్టింగ్ నిర్వాహకుడు రామాంజనేయులు 350 మంది పంటర్ల ద్వారా రూ 4.5 కోట్ల బెట్టింగ్ లు స్వీకరించినట్టు పోలీసులు గుర్తించారు.నిందితుల

...మిగతాది 2 లో

## రాష్ట్రాన్ని చొరబాటుదారులకు
# లీజుకు ఇచ్చారు



✍ జయభేరి, పశ్చిమబెంగాల్ :

పశ్చిమబెంగాల్ రాష్ట్రాన్ని ఆ పార్టీ చొరబాటుదారులు, గూండాలకు లీజుకు ఇచ్చారని టీఎంసీ ప్రభుత్వంపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ ధ్వజమెత్తారు. సందేశ్‌ఖాలీలో మహిళలపై జరిగిన అకృత్యాలను చూసి దేశం మొత్తం నివ్వెరపోయిందన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బెంగాల్‌లోని బాలుర్‌ఘాట్‌లో నిర్వహించిన ప్రచార సభలో మోడీ పాల్గొని ప్రసంగించారు. దేశంలోకి అక్రమంగా ప్రవేశించేవారికి టీఎంసీ మద్దతు ఇస్తుంది. కానీ, శరణార్థులకు పౌరసత్వం ఇచ్చే 'సీఏఏ'ను మాత్రం వ్యతిరేకిస్తోంది. స్థానికంగా అవినీతి, నేరాలు పెచ్చుమీరుతున్నాయి. వాస్తవాలు వెలికితీసేందుకు యత్నిస్తోన్న కేంద్ర సంస్థలపైనా దాడులు జరుగుతున్నాయి. దీన్నిబట్టి చూస్తే టీఎంసీ ఈ రాష్ట్రాన్ని చొరబాటుదారులకు, గూండాలకు అప్పగించినట్లు కనిపిస్తోంది" అని ప్రధాని మోడీ ఆరోపించారు.
టీఎంసీని అవినీతి పార్టీగా పేర్కొంటున్న ప్రధాని మోడీ ముందుగా తాను అద్దంలో చూసుకోవాలని, బిజెపి మొత్తం బందిపోట్లతో నిండిపోయిందని మమతా బెనర్జీ

...మిగతాది 2 లో



# రూ.200 కోట్లు వదులుకుని సన్యాసం

- జనంపై నగదు వర్షం కురిపించిన దంపతులు భవేష్ భండారీ

✍ జయభేరి, గుజరాత్ :

గుజరాత్ కు చెందిన ఒక సంపన్న వ్యాపారవేత్త దంపతులు తమ రూ. 200 కోట్ల సంపదను తృణప్రాయంగా వదిలేసి సన్యాసం స్వీకరించారు. గుజరాత్ లోని తమ స్వస్థలం సబర్ కాంతలో ఆదివారం భారీ ఊరేగింపు నిర్వహించి, డబ్బును, విలువైన ఆభరణాలను, దుస్తులను ప్రజల పైకి విసిరివేశారు. గుజరాత్ వ్యాపారవేత్త భవేష్ భండారీ, ఆయన భార్య ఇటీవల సన్యాసం స్వీకరించాలని నిర్ణయించుకున్నారు. పూర్తిగా నిరాడంబర జీవితాన్ని గడపాలని నిర్ణయించుకుని తమ జీవితకాల సంపాదన అయిన రూ.200 కోట్లను ప్రజలకు విరాళంగా ఇచ్చేశారు. ఆదివారం భారీ ఊరేగింపు నిర్వహించి. పెద్ద ఎత్తున నగదు, ఇతర ఆభరణాలను ప్రజలకు అందజేశారు. త్వరలోనే వారు పూర్తిస్థాయిలో సన్యాసం తీసుకోనున్నారు.
సన్యాసం తీసుకోవాలని నిర్ణయించుకున్న తరువాత, భవేష్ భండారీ దంపతులు తమ సంపదను, నగదును, ఖరీదైన ఆభరణాలను, ఖరీదైన ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ ను ప్రజలకే ఇచ్చివేయాలనుకున్నారు. ఖరీదైన ఉపకరణాలను వాడకూడదని నిర్ణయించుకున్నారు. దాంతో, ఆదివారం గుజరాత్ లోని సబర్ కాంత జిల్లాలో

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## సివిల్స్ లో సత్తా చాటిన..

అక్షయ్ దీపక్196వ ర్యాంకు, గణేశ్న భానుశ్రీ లక్ష్మీ అన్నపూర్ణ 198వ ర్యాంకు, నిమ్మనపల్లి ప్రదీప్ రెడ్డి382వ ర్యాంకు, బన్న వెంకటేశ్ 467వ ర్యాంకు, కడుమూరి హరి ప్రసాద్ రాజు475వ ర్యాంకు, పూల ధనుష్480వ ర్యాంకు, కె.శ్రీనివాసులు526వ ర్యాంకు, నెల్లూరు సాయితేజ 558వ ర్యాంకు, కిరణ్ సాయింపు568వ ర్యాంకు, మర్రిపాటి నాగ భరత్580వ ర్యాంకు, పోతుపురెడ్డి భార్గవ్ 590వ ర్యాంకు, కె. అర్పిత639వ ర్యాంకు, ఐశ్వర్య నెల్లిశ్యామల649వ ర్యాంకు, సాక్షి కుమారి679వ ర్యాంకు, చౌహాన్ రాజ్ కుమార్703వ ర్యాంకు, గాదె శ్వేత711వ ర్యాంకు, వి.ధనుంజయ్ కుమార్ 810వ ర్యాంకు, లక్ష్మీ బానోతు 828వ ర్యాంకు, ఆదా సందీప్ కుమార్830వ ర్యాంకు, జె. రాహుల్ 873వ ర్యాంకు, వేములపాటి హనిత887వ ర్యాంకు, కె. శశికాంత్ 891వ ర్యాంకు, కెసారపు మీనా 899వ ర్యాంకు, రావూరి సాయి అలేఖ్య 938వ ర్యాంకు, గోవద నవ్యశ్రీ 995వ ర్యాంకు.

## భద్రాద్రి సీతారాముల కల్యాణం

సీతారాముల కల్యాణం ప్రత్యక్ష ప్రసారాలపై సస్పెన్స్ కొనసాగుతోంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేంద్ర ఎన్నికల సంఘానికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఈ అంశంపై లేఖ రాశారు. గడిచిన నాలుగు దశాబ్దాలుగా భద్రాచలంలో సీతారాముల కల్యాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్ష ప్రసారాల ద్వారా ప్రజలు వీక్షించే అవకాశం కల్పిస్తుందని, ఎన్నికల నిబంధన పేరుతో ఈ అవకాశానికి అడ్డు తగలవద్దని లేఖలో పేర్కొన్నారు. భక్తుల విశ్వాసాలను గౌరవించడం అందరి బాధ్యత అని, ఎన్నికల సంఘం ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రసారాలకు అనుమతి ఇవ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అయితే సీఈవో వికాస్ రాజ్ నుంచి ఈ లేఖపై ఇప్పటి వరకు ఎలాంటి స్పందన రాకపోవడం గమనార్హం. ఒకవేళ ఎన్నికల సంఘం అనుమతించని పక్షంలో సీతారాముల కల్యాణాన్ని భక్తులు టీవీల్లో వీక్షించే అవకాశాన్ని కోల్పోనున్నారు. భద్రాద్రి రామయ్య కల్యాణానికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలిసారిగా భద్రాద్రి రామయ్యకు సంప్రదాయబద్ధంగా పట్టు వస్త్రాలను తీసుకొస్తారని అందరూ ఆశించారు. అయితే లోక్ సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోతున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఈ హోదాలో రాముల వారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలను సమర్పించనున్నట్లు తెలుస్తోంది.

## ఈ ప్రభుత్వం ఏడాది కూడా..

బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు అన్ని ఆలోచించి ఓటు వేయాలి. మన కండ్ల ముందే మనల్ని మోసం చేస్తుంటే.. మళ్లా వారికే సద్ది కడితే, ఓట్లు వేస్తే ఆగమవుతాం. సంగమేశ్వర, బసవేశ్వర పూర్తి కావాలన్నా, కరెంట్ మంచిగా రావాలన్నా ఈ ప్రభుత్వం మెడలు వంచాలి. కాంగ్రెస్ గెలిచిందని మాకు ఓర్వలేని తనం ఏం లేదు. వారు కూడా ఐదేండ్లు ఉండాలి. అప్పుడే నల్లదేందో తెల్లదేందో తెలుస్తది. కానీ ఈ సీఎం మాటలు చూస్తుంటే, సభల్లో ఆయన వణుకుడు చూస్తుంటే తెలంగాణ జనం తిరగబడ్డదని అర్థమవుతోంది. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 2 సీట్ల కంటే ఎక్కువ రావని సర్వే రిపోర్టులు వస్తున్నాయి. అంతటా అన్ని జిల్లాల్లో కూడా రైతాంగా తిరగబడుతుంది. అందుకే నారాయణపేట సభలో సీఎం భయం చూస్తుంటే ఈ గవర్నమెంట్ ఏడాది కూడా ఉండేటట్టు లేదని మనవి చేస్తున్నా. ఎవడు ఎప్పుడు పోయి బీజేపీలో కలుస్తడో.. ముఖ్యమంత్రే జంప్ కొడుతడో.. ఏమైతదో తెలియని పరిస్థితి. సీఎం ఇక్కడ ఒకటి మాట్లాడుతున్నాడు. అక్కడ ఒకటి మాట్లాడుతున్నాడు. ఢిల్లీకి పోయి బీజేపీకి ఓటు వేయమని చెబుతుండు. ఏం జరుగుతంది. ఎవరు ఎవరికి బీ టీమ్. ఎవరెవరూ కలిసిపోయారు. ఒక్కసారి ఆలోచన చేయాలి. ఏమరుపాటుగా ఉంటే ఇబ్బంది జరుగుతంది. ఇంకా మోసపోతే దెబ్బతింటం అని కేసీఆర్ పేర్కొన్నారు.

## పోలీసుల ఉక్కుపాదం

నుంచి రూ.30,07,200 నగదును స్వాధీనం చేసుకున్నారు. రెండు బ్యాంకుల్లో రూ.49,92,539 సీజ్ చేశారు. ఇటితో పాటు నాలుగు స్మార్ట్ ఫోన్ లు, ఒక స్మార్ట్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. దుండిగల్ పీఎస్ పరిధిలోని మల్లంపేట లో చిన్న బాబు, చిన్నాంశెట్టి కరిముల్ల, పనమటి వెంకటేష్, దింద రమేష్ అనే వ్యక్తులు బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో శంషాబాద్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడిలో రూ 1.19 లక్షలు, రూ 2,400 నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గోకుల్ ఫ్లాట్స్ లోని ఎస్ఆర్ఎస్ డైమండ్ అపార్ట్మెంట్ లో దాడులు నిర్వహించిన మాదాపూర్ పోలీసులు కందుకూరు వీర శంకర్ చారి, భూమిరెడ్డి రాంప్రసాద్ రెడ్డి, వంశీకృష్ణలను అరెస్ట్ చేశారు. ప్రధాన బెట్టింగ్ నిర్వాహకుడు బెంగళూరుకు చెందిన రాజేష్ రెడ్డి, గచ్చిబౌలి ప్రాంతానికి చెందిన సురేష్ రెడ్డి, అనంత పూర్ కు చెందిన నాగరాజున్న రెడ్డి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరి నుంచి రూ.87 వేల నగదు, బ్యాంక్ అకౌంట్లో ఉన్న రూ 1.44కోట్లు సీజ్ చేశారు. జీడిమెట్ల పీఎస్ పరిధిలో SOT బాలానగర్ పోలీసులు గుంటూరుకు చెందిన ఎర్రమంచు అజయ్, వైజాగ్ కు చెందిన మహేష్ కుమార్ లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ 73 వేల నగదు, యూపిఐ ద్వారా సేకరించిన రూ 21 వేల నగదు, రెండు స్మార్ట్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బాచుపల్లి పీఎస్ పరిధిలోని బాలానగర్ పోలీసులు మోర్తల శ్రీకాంత్ రెడ్డి, అలీ లోకేష్, సునీల్ అనే ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారి బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ 13.30 లక్షలను సీజ్ చేశారు. దీంతో పాటు 16 మొబైల్ కి ప్యాడ్ లు, మూడు ల్యాప్టాప్ లు స్వాధీనం చేసుకున్నారు. నితీష్, బుడ్డా రెడ్డి అనే వ్యక్తులు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆన్ లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు ఎవరికైనా అనుమానం కలిగితే వెంటనే 9490617444 నంబర్లకు సమాచారం అందించాలని సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి సూచించారు.

## రూ.200 కోట్లు వదులుకుని సన్యాసం

రథాన్ని తలపించేలా అలంకరించిన వాహనంలో నిల్చొని, కుటుంబ సభ్యులతో కలిసి భారీ ఊరేగింపులో పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తులు ధరించిన భవేష్ భండారీ, ఆయన భార్య వాహనంపై నిల్చొని, భారీగా తరలివచ్చిన ప్రజలపైకి డబ్బులను, ఆభరణాలను, ఇతర విలువైన వస్తువులను విసిరివేశారు. ఆ ఊరేగింపుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇంటర్నెట్లో వైరల్ అవుతోంది. ఆ ఊరేగింపు వీడియోలో వ్యాపారవేత్త, ఆయన భార్య బట్టలు విసరడం, నగదు వర్షం కురిపించడం కనిపించింది. నోట్లు తీసుకునేందుకు జనం ఎగబడుతున్న దృశ్యాలు కూడా ఉన్నాయి. భవేష్ భండారీ నిర్మాణ రంగ వ్యాపారవేత్త. సబర్ కాంత, అహ్మదాబాద్ ల్లో అనేక కన్ స్ట్రక్షన్ ప్రాజెక్టులను నిర్మించారు. ఆయనకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారిద్దరూ 2022 లోనే సన్యాస దీక్ష తీసుకోవడం విశేషం. సన్యాస దీక్ష అనేది ఒక వ్యక్తి సన్యాసి లేదా ఆధ్యాత్మిక క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడపడానికి అధికారికంగా కట్టుబడి ఉండే వేడుక. ఇప్పుడు భవేశ భండారీ దంపతులు కూడా సన్యాసం తీసుకోవాలని నిర్ణయించుకోవడంతో, ఆ కుటుంబం మొత్తం సన్యాస జీవితం గడపనున్నారు. వారు ఎయిర్ కండిషనర్లు, ఫ్యాన్లు, బెడ్లు, ఏ రకమైన ఎలక్ట్రానిక్స్, ఇతర గాడ్జెట్స్ ను వాడబోరు. గతేడాది గుజరాత్ లోని ఓ సంపన్న వజ్రాల వ్యాపారి ధనేష్, అమీ సంఘ్వీ దంపతుల కుమార్తె అయిన తొమ్మిదేళ్ల దేవాన్ని సూరత్ లో సంప్రదాయ జైన ఆచారం అనంతరం సన్యాసినిగా మారింది. అదేవిధంగా 2018లో సూరత్ కు చెందిన వజ్రాల వ్యాపారి 12 ఏళ్ల కుమారుడు భవ్య షా జైన సన్యాసిగా మారాడు. జైన సన్యాసిగా మారడానికి కొన్ని రోజుల ముందు, భవ్య షా తన కుటుంబ స్నేహితుడికి చెందిన తనకు ఇష్టమైన ఫెరారీ కారులో ప్రయాణించారని అతని తండ్రి దీపేష్ షా తెలిపారు.

## రాష్ట్రాన్ని చొరబాటుదారులకు..

విరుచుకుపడ్డారు. "అవినీతి ఆరోపణలపై దర్యాప్తునకు బిజెపి ప్రభుత్వం 300కేంద్ర బృందాలను రాష్ట్రానికి పంపింది. కానీ, ఇంతవరకు ఏం కనుగొనలేదు. ఈ వ్యవహారంపై శ్వేతపత్రం విడుదల చేయాలి. ఉపాధి నిధులు ఏమయ్యాయో బెంగాల్ ప్రజలకు ప్రధాని మోదీ సమాధానం చెప్పాలి" అని డిమాండ్ చేశారు. బిజెపిని 'బెంగాల్ వ్యతిరేక పార్టీ'గా పేర్కొన్న దీదీ.. 'ఎన్ఆర్సీ' ముసుగులో గిరిజనులు, దళితులు, ఓబీసీలను ఇక్కడినుంచి తరిమికొట్టాలని కుట్ర పన్నుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో ఎన్ఆర్సీని అనుమతించబోమని తేల్చి చెప్పారు. తన కాన్వాయ్ ను లక్ష్యంగా చేసుకుని కొందరు భాజపా నేతలు 'దొంగ దొంగ' అని అరిచారని ఆమె ఆరోపించారు. "నేను ఎంపీ పింఛన్ డ్రా చేయడం లేదు. జీతం కూడా తీసుకోను. సొంత కారులో ప్రయాణిస్తాను. సాధారణ వస్త్రాలే ధరిస్తాను. సాదాసీదా జీవితాన్ని గడుపుతున్నాను. చాయ్ ఖర్చులూ నేనే చెల్లిస్తాను" అని తెలిపారు.

# వందే రామం.. జగద్గురుం..

నమస్తే.. ముందుగా 'జయభేరి' న్యూస్ ప్రేక్షకులందరికీ... శ్రీరామనవమి శుభాకాంక్షలు...
ఒకసారి పార్వతీదేవి పరమశివుని విష్ణు సహస్రనామ స్తోత్రమునకు కాస్త సూక్ష్మమైన మార్గం చెప్పమని కోరుతుందట. దానికి పరమేశ్వరుడు, "ఓ పార్వతీ! నేను నిరంతరము ఆ ఫలితము కోరకు జపించేది ఇదే సుమా!" అని ఇలా శ్లోకంతో మంత్రోపాసన చేసా డట... శ్రీ రామ రామ రామేతి... రమే రామే మనోరమే | సహస్ర నామతత్తుల్యం రామనామ వరాననే || ఆని మనం మనస్ఫూర్తిగా శ్రీరాముని స్మరించుకుంటూ మూడుమార్లు స్మరిస్తే చాలు, ఒక్క విష్ణు సహస్రనామ పారాయణ ఫలితమేకాదు, భక్తులకు శివసహస్రనామ ఫలితం కూడా లభిస్తుంది. దుష్టశిక్షణ, శిష్టరక్షణార్థమై చైత్రశుద్ధ నవమి నాడు, పునర్వసు నక్షత్రంతో కూడిన కర్కాటక లగ్నంలో పగటి సమయాన సాక్షాత్తు ఆ శ్రీహరియే కౌసల్యాపుత్రుడై ఈ భూమిపైన జన్మించిన పర్వదినాన్ని మనం 'శ్రీరామనవమి'గా విశేషంగా జరుపుకుంటాం. ఆ విశేషాలు ఏంటో మనం ఇప్పుడు చూద్దాం....

**జయభేరి, హైదరాబాద్ :**



శ్రీరామనామ గానమధుపానాన్ని భక్తితో సేవించి, శ్రీరామ నీనామ మేమి రుచిరా... ఎంతోరుచిరా... మరి ఎంతో రుచిరా... అని కీర్తించాడు ఆనాడు భక్త రామదాసు.
మనం శ్రీరామనామాన్ని ఉచ్చరించేటప్పుడు 'రా' అనగానే మన నోరు తెరచుకుని మనలోపల పాపాలన్ని బయటకు వచ్చి ఆ రామనామ అగ్నిజ్వాలలో పడి దహించుకుపోతాయట! అలాగనే 'మ'అనే అక్షరం ఉచ్చరించినప్పుడు మననోరు మూసుకుంటుంది కనుక బయట మనకు కనిపించే ఆ పాపాలు ఏవీ మనలోకి ప్రవేశించలేవని మన పెద్దలు చెప్పిన పురాణ ఇతిహాస సత్యం... అంతలా రామనామ స్మరణ' మిక్కిలి జ్ఞానాన్ని, జన్మరాహిత్యాన్ని కలిగిస్తుందట!
ముఖ్యంగా రామాయణం, రామ నవమిలలో సూర్యుని ఆరాధనకు చాలా ప్రాముఖ్యత ఉంది. అందుకనే "రవి" అంటే సూర్యుడు. రాముడు జన్మించిన సూర్యవంశానికి ఆరాధ్యుడిగా చెబుతారు కాబట్టి ఈ వంశానికి చెందిన ప్రముఖ రాజులు దిలీపుడు, రఘు మొదలైనవారు ఉన్నారు .వీరిలో రఘు అనే రాజు కచ్చితంగా మాట మీద నిలబడేవాడిగా ప్రసిద్ధి గాంచాడు. అందుకే రామున్ని ,రఘు రాముడు, రఘునాథుడు, రఘుపతి, రాఘవేంద్రుడు మొదలైన పేర్లతో పిలుస్తారు.
శ్రీరామ నవమి గూర్చి చారిత్రాత్మకమైన చరిత్రను పరిశీలిస్తే..... వశిష్ట మహాముని దశరథ రాజుకు పుత్ర కామేష్టి యాగం చేయమని సలహా ఇచ్చాడట. రుష్య శృంగ మహామునికి యజ్ఞాన్ని నిర్వహించే బాధ్యతను అప్పజెప్పమన్నాడు. వెంటనే దశరథుడు ఆయన ఆశ్రమానికి వెళ్ళి ఆయనను తన వెంట అయోధ్యకు తీసుకుని వచ్చాడట. ఆ యజ్ఞానికి తృప్తి చెందిన అగ్ని దేవుడు, పాయసంతో నిండిన ఒక పాత్రను దశరథుడికిచ్చి భార్యలకు ఇవ్వమన్నాడట. దశరథుడు అందులో సగ భాగం మొదటి భార్య కౌసల్యకూ, రెండో సగ భాగం చిన్న భార్య యైన కైకేయికి ఇచ్చాడట. వారిద్దరూ వారి వాటాల్లో సగం మిగిల్చి రెండో భార్యయైన సుమిత్రకు ఇచ్చారట. కొద్దికాలానికే వారు ముగ్గురూ గర్భం దాల్చారట. చైత్ర మాసం తొమ్మిదవ రోజైన నవమి నాడు, మధ్యాహ్నం కౌసల్య రామునికి జన్మనిచ్చింది. అలాగే కైకేయి భరతుడికీ, సుమిత్ర లక్ష్మణ శత్రుఘ్నులకు జన్మనిచ్చారు. ఇది చరిత్ర చెబుతున్న శ్రీరాముని జననానికి ముఖ్య కారణం.
శ్రీరాముడు వసంత ఋతువులో చైత్ర శుద్ధ నవమి, పునర్వసు నక్షత్రపు కర్కాటక లగ్నంలో సరిగ్గా అభిజిత్ ముహూర్తంలో అంటే మధ్యాహ్నం 12 గంటలకు త్రేతాయుగంలో జన్మించాడు అని పురాణ ప్రతీతి. పద్నాలుగు సంవత్సరాలు అరణ్య వాసము, రావణ సంహారం తరువాత శ్రీరాముడు సీతాసమేతంగా అయోధ్యలో పట్టాభిషిక్తుడైనాడు. ఈ శుభ సందర్భం కూడా చైత్ర శుద్ధ నవమి నాడే జరిగినదని ప్రజల విశ్వాసము. శ్రీ సీతారాముల కళ్యాణం కూడా ఈరోజునే శ్రీ సీతారాముని భక్తులు ఘనంగా కళ్యాణాన్ని జరుపుకుంటారు. దానిని ఆదిదంపతులు కళ్యాణ మహోత్సవంగా మనకు శ్రీ సీతారాముల వారి పాటలు వీనుల విందుగా వినపడుతుంటాయి...
శ్రీరామనవమిపండగ సందర్భంగా హిందువులు సాధారణంగా తమ ఇళ్ళలో చిన్న సీతా రాముల విగ్రహాలకు కల్యాణోత్సవం నిర్వహిస్తుంటారు. విగ్రహాలను వీధుల్లో ఊరేగిస్తారు. తొమ్మిది రోజులు పాటు ఈ ఉత్సవాలను జరిపి ఆ తర్వాత ఉత్సవాలను ముగిస్తారు. ఈ ఉత్సవంలో ప్రధాన ఆకర్షణ అందంగా అలంకరించిన రథం, అందులో రాముడు, లక్ష్మణుడు, సీత, హనుమంతుల వేషాలు ధరించిన నలుగురు వ్యక్తులు. ఈ రథంతో పాటుగా పురాతన వేషధారణతో రాముని సైనికుల్లా కొద్దిమంది అనుసరిస్తారు. ఊరేగింపులో పాల్గొనేవారు చేసే రామరాజ్యాన్ని గురించిన పొగడ్తలు, నినాదాలతో యాత్ర సాగిపోతుంది .హిందువులు ఉపవాస దీక్షను పాటిస్తారు. దేవాలయాలను అందంగా విద్యుద్దీపపు కాంతులతో అలంకరిస్తారు. రామాయణాన్ని పారాయణం చేస్తారు. శ్రీరామునితో బాటు సీతాదేవిని, లక్ష్మణుని, ఆంజనేయుని కూడా ఆరాధిస్తారు.. దేశంలోని ప్రజలంతా సిరిసంపదలతో, సుఖ సంతోషాలతో ఉంటే అది రామరాజ్యమని హిందువుల విశ్వాసం. నీతి, సత్ప్రవర్తన మరియు సద్గుణం ద్వారా ఆదర్శవంతమైన రాజుగా భూలోకంలో శ్రీరామచంద్రుని ఆదర్శంగా తీసుకుంటారు. అలాగే ఏకపత్ని వ్రతుడుగా బహుభార్యత్వాన్ని రద్దు చేస్తూ ఆయన నడిచిన తీరును నేటి కుటుంబ వ్యవస్థకు పటిష్ట పునాదిగా భావిస్తారు.
శ్రీరామ నవమి రోజున శ్రీరాముని జననమే కాకుండా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని కూడా హిందూ ఆచార ధర్మ ప్రకారం మన దేశంలో ఎక్కువగా జరుపుతారు. అలాగే భారతీయ సనాతన ధర్మానికి కుటుంబ వ్యవస్థకు ప్రతిష్టమైన పునాదిని వేసిన శ్రీ సీతారాముల వారిని ఆదిదంపతులుగా భావిస్తూ వారిని నిత్యం ప్రతి ఇంట్లో వారి విగ్రహాలను పెట్టుకుని పూజించడం జరుగుతుంది.
ఈ సందర్భంగా శ్రీరామనవమి రోజున జీ టీవీ న్యూస్ ప్రేక్షకులందరికీ శ్రీ సీతారామ ఆంజనేయ స్వామి ఆశీస్సులు అందరికీ కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటు....



కడారి శ్రీనివాస్
కాలమిస్ట్, సీనియర్ జర్నలిస్ట్, కవి, రచయిత
గాయకులు, సామాజిక ఉద్యమకారులు

# వ్యవస్థను తక్కువ చేసి చూపించొద్దు

విదేశాలతో మన ఓటింగ్ ప్రక్రియను పోల్చి వ్యవస్థను తక్కువ చేయొద్దు. ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఈవీఎం ఓట్లతో వీవీప్యాట్ స్లిప్‌లను క్రాస్ వెరిఫై చేయాలంటూ దాఖలైన పిటీషన్లపై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ జరిపింది. ఈసందర్భంగా రహస్య బ్యాలెట్ ఓటింగ్ పద్ధతి వల్ల ఎదురయ్యే సమస్యలను ప్రస్తావించిన న్యాయస్థానం పిటీషనర్లపై ఒకింత అసహనం వ్యక్తం చేసింది. ఈ పిటిషన్‌పై అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫామ్స్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ ఐరోపా దేశాల్లోని ఎన్నికల ప్రక్రియను ప్రస్తావించారు. జర్మనీ లాంటి దేశాలు ఈవీఎంల నుంచి తిరిగి పేపర్ బ్యాలెట్ల వద్దకే వచ్చాయి. ఈవీఎంల వల్ల అవకతవకలు జరుగుతాయని మేం చెప్పడం లేదు. ఈవీఎం, వీవీప్యాట్లను మార్చే అవకాశం ఉందని చెబుతున్నాం. అందుకే మళ్లీ మనం కూడా పేపర్ బ్యాలెట్ పద్ధతిని వినియోగించాలి. లేదా వీవీప్యాట్ స్లిప్‌లను ఓటర్ల చేతికి ఇవ్వాలి. లేదా ఓటు వేసిన తర్వాత వీవీప్యాట్ స్లిప్‌లను ఓటర్లే బ్యాలెట్ బ్యాక్సుల్లో వేసేలా రూపొందించాలి అని వాదించారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ జర్మనీ జనాభా ఎంత? అని అడిగింది. 6 కోట్ల మంది అని ఆయన జవాబివ్వగా.. "మన దేశంలో 97కోట్ల మంది ఓటర్లున్నారు. అన్ని వీవీప్యాట్లను లెక్కించాలని మీరు కోరుతున్నారు. మేం ఆరు పదుల వయసులో ఉన్నాం. బ్యాలెట్ పేపర్లు వినియోగించినప్పుడు గతంలో ఏం జరిగిందో మాకు తెలుసు. మీరు మర్చిపోయినా మేం మర్చిపోలేదు" అని ధర్మాసనం తెలిపింది. ఈసందర్భంగా ధర్మాసనంలోని జస్టిస్ దీపాంకర్ దత్తా స్పందిస్తూ.. "జర్మనీతో పోలిస్తే నా సొంత రాష్ట్రం పశ్చిమబెంగాల్ జనాభా ఎక్కువ. భారత ఎన్నికల ప్రక్రియను విదేశాలతో పోల్చడం సరికాదు. మనం ఎవరో ఒకరిపై విశ్వాసం ఉంచాలి. ఇలా వ్యవస్థను తక్కువ చేసి చూపించేందుకు ప్రయత్నించకూడదు.



ఇలాంటి ఉదాహరణలు చూపించొద్దు" అని అసహనం వ్యక్తం చేశారు.
విచారణ సందర్భంగా ఓటింగ్, ఈవీఎంలను భద్రపర్చడం, కౌటింగ్ ప్రక్రియ గురించి ఎన్నికల సంఘాన్ని కోర్టు ఆరా తీసింది. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసినవారికి కఠిన శిక్ష లేకపోవడంపై ధర్మాసనం పెదవి విరిచింది. "ఇది తీవ్రమైన అంశం. శిక్ష పడుతుందనే భయం ఉండాలి" అని వ్యాఖ్యానించింది. అనంతరం దీనిపై తదుపరి విచారణను ఏప్రిల్ 18వ తేదీకి వాయిదా వేసింది. కాగా.. ఆ మరుసటి రోజే అంటే ఏప్రిల్ 19న లోక్‌సభ ఎన్నికల తొలివిడత పోలింగ్ జరగనుండటం గమనార్హం.



# విధులకు హాజరుకాకుంటే ఎఫ్ఐఆర్ నమోదు

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ లోక్ సభ ఎన్నికల విధులకు హాజరుకాని సిబ్బందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయనున్నట్టు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ హెచ్చరించారు. ఎన్నికల్లో పాల్గొనేందుకు 23వేల మంది సిబ్బందిని శిక్షణకు ఎంపిక చేస్తే 1700 మంది గైర్హాజరయ్యారని మండిపడ్డారు. వారిలో అనారోగ్యంతో బాధపడేవారు, గర్భిణిలను మినహాయించి మిగిలిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలోని హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ తో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి ఎన్నికల ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. ఈనెల 18 నుంచి 25వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్టు చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని వివరించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై క్రిమినల్ కేసులు ఉంటే కచ్చితంగా పత్రికల్లో ప్రచురించాలని సూచించారు. గతేడాది జిల్లాలో 45 శాతం మాత్రమే ఓటింగ్ అయిందని, ఈసారి అవగాహన కార్యక్రమాలతో మరో 10శాతం పెంచేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు.

# గత బీఆర్ఎస్ పాలనే కాంగ్రెస్ కొనసాగిస్తోంది

- అమలు కానీ హామీలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తుంది - మల్కాజ్ గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్
- ఈటెల సమక్షంలో కమలం గూటికి చేరిన శామీర్ పేట్ మాజీ ఎంపిపి చంద్రశేఖర్ యాదవ్
- ఈ సారి మల్కాజ్ గిరి సీటు బీజేపీ దే- చంద్రశేఖర్ యాదవ్

**జయభేరి, ఏప్రిల్ 16 :**

కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే చెత్త బుట్టలో వేసినట్లే అని, సాధ్యం కాని హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని మల్కాజ్ గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పేద వాళ్ల బతుకులు బాగుపడాలంటే బీజేపీ కే పట్టం కట్టాలని ఆయన కోరారు. తుంకుంట మున్సిపల్ కేంద్రంలో ఉమ్మడి శామీర్ పేట్ మాజీ ఎంపిపి చంద్రశేఖర్ యాదవ్ తో పాటు ఈశ్వర్ గౌడ్, పరమేష్ యాదవ్, మహేష్ యాదవ్, పవన్ యాదవ్, రాంచందర్, వినయ్ జెన్, పవన్ , సూరి, కస్తూరి నాగులు, నర్సింగరావు,యోగితో పాటు 100మంది నేతలు ఈటెల రాజేందర్ సమక్షంలో బీజేపీ గూటికి చేరారు. అనంతరం ఈటెల మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ పార్టీ పాలనకు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ పాలనకు ఏ మాత్రం తేడా లేదని, కేసీఆర్ ఎలాంటి రాజకీయాలు చేశారో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా అదే కొనసాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజాదారణ లేదని, డబ్బు, పదవుల ఆశ చూపెట్టి నేతలను కాంగ్రెస్ లో చేర్చుకుంటున్నారని ధ్వజమెత్తారు. గత ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చిన రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కటైన నెరవేర్చారా అని ప్రశ్నించారు. 17 సీట్లు గెలిపిస్తే హామీలన్నీ నెరవేరుస్తా అని చెపుతున్న





ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గెలిచాక ఆ హామీ నిలబెట్టుకుంటారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ కు ఓటు వేస్తే ఆ ఓటు విలువ జీరో అని అన్నారు. పేదవాళ్ళ బతుకులు బాగు పడాలంటే బీజేపీ తోనే సాధ్యం అన్నారు. ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 4 కోట్ల మంది పేదవారికి ఇళ్ళు కట్టించి ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలు చేయకపోతే ఆ బాధ్యత తాము తీసుకుంటాం అని మోడీ నిర్ణయించడం గొప్ప విషయం అని గుర్తు చేశారు. పేదల ఇంటి నిర్మాణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సహకరించక పోతే కేంద్ర ప్రభుత్వం ఇళ్లు కట్టించే బాధ్యత తీసుకుంటుందని చెప్పారు. ఈ సారి జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్ గిరి ఎంపీగా తనను గెలిపించాలని ఈటెల వేడుకున్నారు. అనంతరం మాజీ ఎంపిపి చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ శివాజీ మహరాజ్, వివేకానంద స్ఫూర్తితో ధర్మం కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈటెల రాజేందర్ కు ఓటు వేస్తే ప్రధాని మోడీ కి ఓటు వేసినట్లే అని స్పష్టం చేశారు. బీజేపీ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, మల్కాజ్ గిరి బీజేపీ పార్లమెంట్ ఇంచార్జ్ ఏనుగు సుదర్శన్ రెడ్డి, తుంకుంట మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రాష్ట్ర నాయకులు ఈశ్వర్ గౌడ్, బుద్ధి శ్రీనివాస్, మూడు చింతల పల్లి పార్టీ అధ్యక్షుడు నందల శ్రీనివాస్, మండల సీనియర్ నాయకులు మైసయ్య,తదితరులు పాల్గొన్నారు.



## రాగిడి లక్ష్మారెడ్డి ని భారీ మెజారిటీతో గెలిపిద్దాం

**జయభేరి, ఉప్పల్ :**

మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గం,BRS పార్టీ సన్నాహక సమావేశం లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీ బండారి లక్ష్మారెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జి జహంగీర్. మల్లాపూర్ SLNS ఫంక్షన్ హాలులో మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గం, మల్లాపూర్ డివిజన్ BRS పార్టీ నాయకుల సన్నాహక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. స్థానిక కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జి జహంగీర్ పాల్గొన్నారు. ఈ సమావేశానికి పన్నాల దేవేందర్ రెడ్డి కార్పొరేటర్ మల్లాపూర్ డివిజన్, ప్రధాన కార్యదర్శి వాసు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి రథోత్సవం



**జయభేరి, మేడ్చల్ :**

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయానికి చాలా ప్రత్యేకతలు ఉన్నాయి. ఈ ఆలయాన్ని 400 సంవత్సరాల క్రితం అక్కన్న మదన్న లు నిర్మించారని స్థల పురాణం చెపుతుంది. ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తారు. ఈ వేడుకల్లో మొదటి రోజు హోమం కార్యక్రమంతో మొదవుతుంది. నవమి రోజు శ్రీ సీతారాముల కళ్యాణాన్ని నల్గిగా అణువంశీక అర్చకులు ఘనంగా నిర్వహిస్తారు. శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా ఆలయ కమిటీ నూతనంగా ఏర్పాటు చేసిన రథాన్నికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలోని అర్చకుల నివాసం నుండి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేపట్టారు. ఈ రథోత్సవంలో ప్రజలు, యువకులు, పెద్ద ఎత్తున పాల్గొని రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. శ్రీరామ.. జయజయరామా... జానకిరామా... అంటూ శ్రీరామున్ని స్మరిస్తూ రథాన్ని ముందుకు తీసుకెళ్లారు.

## సమస్యలపై మీ గొంతుకై

- ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**



నాచారం డివిజన్ మల్కాజ్గిరి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశములో పాల్గొన్న ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎన్నికల ఇన్చార్జ్ జహంగీర్, నాచారం డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి శాంతి సాయి జన్ శేఖర్, డివిజన్ ప్రెసిడెంట్ మేకల ముత్యంరెడ్డి, సీనియర్ నాయకులు మల్లికార్జున్ గౌడ్, ఇతర నాయకులు కార్యకర్తలు. ఉప్పల్ నియోజకవర్గం నాచారం డివిజన్ టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు చాలా ఉత్సాహంగా పనిచేస్తారని ఎందుకు నిదర్శనం గత ఎన్నికల్లో వచ్చిన మెజారిటీలే అని ఎంపీ అభ్యర్థి తెలియజేశారు. బండారి లక్ష్మారెడ్డి కోసం కృషి చేసినట్లుగానే ఈ ఎన్నికల్లో కూడా మీరంతా కృషి చేయాలని కోరారు.

ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. 25 సంవత్సరాలుగా ప్రజా క్షేత్రంలో ఉండి అందరికీ అందుబాటులో ఉంటూ ఇకముందు కూడా మీకు అందరికీ అందుబాటులో ఉండి మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ సమస్యలపై మీ గొంతుకై రాగిడి లక్ష్మారెడ్డి పనిచేస్తానని అన్నారు.





## బీఆర్ఎస్ కు వీడ్కోలు

- ఉద్యమ కారులను బీఆర్ఎస్ విస్మరించిందని ఆక్షేపన
- త్వరలోనే తన రాజకీయ భవిష్యత్ ప్రకటిస్తా - అఫ్జల్ ఖాన్

**జయభేరి, ఏప్రిల్ 16 :**

శామీర్ పేట్ మండలంలో బీఆర్ఎస్ కు వరుస షాక్ లు తగులుతున్నాయి.. ఆ పార్టీ నేతలు క్యూ కట్టి బీఆర్ఎస్ ను వీడుతున్నారు. తాజాగా కేసీఆర్ సేవాదళం రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ తన పదవికి మరియు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా అఫ్జల్ ఖాన్ మాట్లాడుతూ.. తాను బీఆర్ఎస్ పార్టీలో ఉంటూనే నాయకులు చేసిన తప్పిదాలను తూర్పార పట్టానని, అదేవిధంగా ఉద్యమకారులకు న్యాయం చేయాలని గళం విప్పానని స్పష్టం చేశారు. ఉద్యమ కారులను పట్టించుకోకపోవడం వల్లే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీ కి పరాభవం ఎదురైందని చెప్పారు. త్వరలోనే తన రాజకీయ భవిష్యత్ ప్రకటిస్తానని వెల్లడించారు.

## శిరసనగండ్ల జాతరకు ప్రత్యేక బస్సులు

- ఆర్టీసీ డిపో మేనేజర్ రాజీవ్ ప్రేమ్ కుమార్



**జయభేరి, నాగర్ కర్నూల్ :**

చారగొండ మండలం సిరసనగండ్ల లో గుట్టపై వెలసిన రామాలయం లో వారం రోజులపాటు అంగరంగ వైభవంగా జరిగే శ్రీరామనవమి జాతరకు భక్తుల సౌకర్యం కొరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని దేవరకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ రాజీవ్ ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.దేవరకొండ బస్ స్టేషన్ నుంచి, మరియు డిండి బస్ స్టేషన్ నుంచి ఈనెల 17వ తేదీ 20వ తేదీ 21వ తేదీ 22వ తేదీలలో ప్రత్యేక బస్సులు నడపనున్నామని, భక్తులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కంచర్ల కృష్ణారెడ్డి ని అత్యధిక మెజార్టీతో గెలిపియండి

- సూర్యాపేట శాసనసభ్యులు మాజీ మంత్రివర్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి

**జయభేరి, దేవరకొండ :**



రాష్ట్రంలో పాలన అగమ్యగోచరంగా తయారయిందని, పంటలు ఎండిపోయి అన్నదాతలు ఆగం అయ్యారని మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు దేవరకొండ పట్టణంలో జరిగిన నియోజకవర్గ పార్లమెంటరీ సన్నాహక సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బిఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపుకు ఆకాంక్షిస్తూ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ హామీలు నమ్మి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని,ప్రాజెక్టులను కేంద్రానికి అప్పజెప్పి కాంగ్రెస్ నేతలు పెద్ద మోసం చేశారని అన్నారు. కేసీఆర్ నల్గొండ సభలో పెడితే భయపడి కాంగ్రెస్ వాళ్ళు అసెంబ్లీలో తీర్మానం చేశారని, పంటలు ఎండిపోతే ఎవ్వరు పట్టించుకోలేదని తెలిపారు. కాంగ్రెస్ వాళ్లు ఓట్లు దండుకొని, ఇప్పుడు మొఖం చాటేశారని ,రుణమాఫీ చేయకపోవడం తో, అన్నదాతలు pvt వడ్డీ వ్యాపారుల వద్దకు పోతున్నారని గుర్తు చేసారు. 500 బోనస్ ఇస్తాం అని మోసం చేసి, వీటన్నిటిపై కేసీఆర్ ప్రజల తరపున కొట్లాడుతున్నారని అన్నారు.200 మంది అన్నదాతలు ఆత్మహత్య చేసుకున్నారని,అయినా ప్రభుత్వం కి చలనం లేదని,మంత్రి కోమటిరెడ్డి అబద్దపు మాటలు మాటలు మాట్లాడితున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, నల్లగొండ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్, నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి, ఆలేరు మాజీ శాసనసభ్యులు బూడిద బిక్షమయ్య గౌడ్ టిఆర్ఎస్ నాయకులు కేతావత్ బిల్యా నాయక్, నేనావత్ కిషన్ నాయాక్ నియోజకవర్గ బిఆర్ఎస్ కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు

## కాటేసిన పాముతో ఆసుపత్రికి వచ్చిన మహిళ

**జయభేరి, వెంకటాపురం :**

పాము కాటేసిందని ఓ మహిళ ఏకంగా పాముతో సహా ఆసుపత్రికి వచ్చింది. దీంతో డాక్టర్లు అందరూ షాక్ అయ్యారు. ములుగు జిల్లాలో వెంకటాపురం మండలం ముకునూరుపాలెం గ్రామానికి చెందిన శాంతమ్మ అనే మహిళ కూలీ పని చేసుకుంటూ జీవనంసాగిస్తుంది. రోజులాగా సోమవారం కూడా కూలిపని కోసం వెళ్లింది. అయితే అక్కడ అందరితో కలిసి ఉపాధి పనులు చేస్తుండగా ఒక్కసారిగా ఆమెచేతికి ఏదో తాకినట్లు అనిపించింది. అయితే తరువాత ఆమె చేతి వేలికి నొప్పి ఎక్కవ కావడంతో ఏమైందంటూ చేతిని చూడగా పాముకాటు వేసి అక్కడి నుంచి వెళుతుంది. వెంటనే ఆ పామును గమనించిన శాంతమ్మ దానిని పట్టుకుంది. అక్కడ వున్న వారంత శాంతమ్మను చూసి షాక్ అయ్యారు. ఏం జరిగింది అని అడుతుండగానే వైద్యుల దగ్గరకు తీసుకుని వెళ్లాలని శాంతమ్మ సూచించింది. ఆసుపత్రిలో శాంతమ్మ పాముతో సహా అడుగుపెట్టగానే అక్కడున్న రోగులే కాదు, నర్సులు, డాక్టర్లు అందరూ భయాందోళన చెందారు. శాంతమ్మ ఎందుకు పాముతో వచ్చిందో వారందరికి అర్థంకాలేదు. తరువాత శాంతమ్మ సార్ నా చేతి వేళికి ఈ పామే కాటేసింది.. చికిత్స చేయండి అంటూ వైద్యుడి దగ్గరకు వెళ్లగా పామును చూసిన వైద్యులు అది విషపూరితమైన పామని బయటకు తీసుకుని వెళ్లాలని సూచించాడు. శాంతమ్మను వెంటనే మెరుగైన వైద్యం అందించాడు. పామును బయట స్థానికులు చంపి బాలిల్లో వేసి పడేశారు.

## శ్రీ నవబారత్ డిగ్రీ కళాశాల సిల్వర్ జూబ్లీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వేడుకలు



**జయభేరి, మేడిపల్లి, ఏప్రిల్16:**

శ్రీ నవభారత్ డిగ్రీ కళాశాల భువనగిరి 1996 1999 ఆర్ట్స్ పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం వేడుకలు మేడిపల్లి సంపూర్ణ హోటల్లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్నిపూర్వ విద్యార్థుల,ఉపాధ్యాయుల నెంబర్లు సేకరించి అందరు ఒక్క దగ్గర చేరడానికి కృషి చేసిన శివరాత్రి రామకృష్ణ ,సహకరించిన డాక్టర్ కడారి శ్రీనివాస్,శేరి సవితా కరుణాకర్ రెడ్డి, సుధ,కిషోర్, శ్రీధర్ లకు పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాలేజీ జ్ఞాపకాలను గుర్తుకు చేసుకొని సంతోషం వ్యక్తంచేశారు.



### శ్రీరామ నవమికి ఈ అయిదు ప్రత్యేక ప్రసాదాలను నివేదించండి

# మీ కోరికలు నెరవేరుతాయి

దేశవ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగేందుకు సిద్ధమవుతున్నాయి. అయోధ్యలో రామ్ లల్లా బాల రూపాన్ని పూజిస్తారు. ఈ రోజున శ్రీరామునికి ప్రత్యేకమైన, ఇష్టమైన కొన్ని ప్రత్యేకమైన ప్రసాదాలను సమర్పించాలి. వాల్మీకి రామాయణం ప్రకారం, విష్ణువు ఏడో అవతారం శ్రీ రాముడు. రాముడు చైత్ర మాసంలోని శుక్ల పక్షంలో నవమి తిథి నాడు జన్మించాడు. ఈ రోజున శ్రీరామనవమిని భారతదేశంలోనే కాకుండా విదేశాలలో కూడా చాలా వైభవంగా నిర్వహించుకుంటారు.

వాల్మీకి రామాయణం ప్రకారం, విష్ణువు ఏడో అవతారం శ్రీరాముడు. రాముడు చైత్ర మాసంలోని శుక్ల పక్షంలో నవమి తిథి నాడు జన్మించాడు . ఈ రోజున శ్రీరామనవమిని భారతదేశంలోనే కాకుండా విదేశాలలో కూడా చాలా వైభవంగా నిర్వహించుకుంటారు.

పంజిరి రామ్ లల్లాకు అత్యంత ఇష్టమైన నైవేద్యం పంజీరి. శ్రీరామనవమి రోజున నెయ్యి, పంచదారతో చేసిన పంజిరీ శ్రీరాముడికి సమర్పించండి. అందులో తులసి ఆకులు వేయడం మర్చిపోవద్దు. ఇలా ఈ ప్రసాదాన్ని సమర్పించడం వల్ల వైవాహిక జీవితంలో మాధుర్యం పెరుగుతుందని నమ్ముతారు.

అన్నం పాయసం: శ్రీరాముడికి అన్నం పాయసం అంటే చాలా ఇష్టం. శ్రీరామనవమి నాడు అన్నప్రసాదాలు సమర్పించడం వల్ల లక్ష్మీదేవి అనుగ్రహం లభిస్తుంది. సంతానం కావాలనే కోరిక నెరవేరుతుంది. పురాణాల ప్రకారం, కౌసల్య మాత బియ్యం పాయసాన్ని దైవ ప్రసాదంగా తిన్నట్టు చెబుతారు, ఆ తరువాత శ్రీరాముడు జన్మించాడు. శ్రీరాముడు జన్మించిన సమయంలో బియ్యం పాయసం తయారు చేశారని కూడా నమ్ముతారు.

పంచామృతం పురాణాలలో విష్ణువు ఆరాధనలో పంచామృతానికి ప్రత్యేకత ఉంది. శ్రీరామనవమి రోజున పాలు, పెరుగు, నెయ్యి, తేనె , పంచదార కలిపి పంచామృతాన్ని నివేదిస్తారు.

కందమూలాలు శ్రీరామనవమి నాడు శ్రీరాముడికి కందమూలాలు సమర్పించండి. పురాణాల ప్రకారం, శ్రీరాముడు తన వనవాస సమయంలో దుంపలను తిని జీవించాడు. ఇది శ్రీరామునికి ఇష్టమైన ఆహారం. ఇది కుటుంబానికి సంతోషాన్ని ఇస్తుందని నమ్ముతారు.

కేసర్ భాత్ శ్రీరామ నవమి నాడు, ఇంట్లో రామ్ లల్లాకు కుంకుమపువ్వు వేసిన అన్నాన్ని సమర్పించండి. శ్రీరాముడికి కుంకుమపువ్వు బియ్యాన్ని సమర్పిస్తే పేదరికం తొలగిపోతుందని నమ్ముతారు.





224 పరుగుల ఛేదనలో భాగంగా 14 ఓవర్లలో రాజస్థాన్ స్కోరిది 128/6. ఆ జట్టు విజయానికి 36 బంతుల్లో 96 పరుగులు కావాలి. రాజస్థాన్ గెలవడం కష్టమే అనుకున్నారు అందరు. కానీ టాపార్డర్, మిడిలార్డర్ బ్యాటర్లంతా డగౌట్‌లో ఉంటే ఓపెనర్‌గా వచ్చిన బట్లర్ మాత్రం ఒంటరిపోరాటం చేసి ఆ జట్టుకు సంచలన విజయాన్ని అందించాడు. సూపర్ సెంచరీతో రాయల్స్ గెలుపు జోరును మరింత ముందుకు తీసుకెళ్లాడు. ఐపీఎల్‌లో అత్యుత్తమ లక్ష్యఛేదన రికార్డును రాజస్థాన్ ఖాతాలో వేసుకుంది. తొలుత విండీస్ వీరుడు సునీల్ నరైన్ మరోసారి ఆకాశమే హద్దుగా రెచ్చిపోవడంతో కోల్‌కతా 223 పరుగుల భారీ స్కోరు చేసింది. ఈ ఇద్దరి శతకాలతో హైదరాబాద్‌బెంగళూరు మ్యాచ్‌లో పరుగుల జడివానలో తడిసిముద్దయిన 24 గంటలు గడవకముందే కోల్‌కతారాజస్థాన్ మ్యాచ్ ఐపీఎల్ అభిమానులను మరో 'రన్ ఫీస్ట్' అలరించింది.

# సంచలన విజయం

## రాయల్స్ జోష్
## బట్లర్ సూపర్ సెంచరీ
## ఐపీఎల్‌లో అత్యుత్తమ లక్ష్యఛేదన

పేరుకు తగ్గట్టే రాజస్థాన్ 'రాయల్స్' విక్టరీ కొట్టింది. కోల్‌కతా నిర్దేశించిన 224 పరుగుల ఛేదనలో ఒకదశలో గెలుపు కష్టమనుకున్న మ్యాచ్‌లో జోస్ బట్లర్ (60 బంతుల్లో 107 నాటౌట్, 9 ఫోర్లు, 6 సిక్సర్లు) అసాధ్యాన్ని సుసాధ్యం చేసి రాజస్థాన్‌కు అనూహ్య విజయాన్ని అందించాడు. ఛేదనలో 8 వికెట్లు కోల్పోయిన ఆ జట్టు ఆఖరి బంతికి విజయాన్ని అందుకుంది. ఐపీఎల్ చరిత్రలో భారీ లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించిన జట్టుగా రాజస్థాన్ రికార్డుల్లోకెక్కింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన కేకేఆర్ ఓపెనర్ సునీల్ నరైన్ (56 బంతుల్లో 109, 13 ఫోర్లు, 6 సిక్సర్లు) శతకంతో ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 223 పరుగులు చేసింది. బ్యాట్‌తో సెంచరీ బాదిన నరైన్ బౌలింగ్ (2/30)లోనూ రాణించాడు. బట్లర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ సీజన్‌లో రాజస్థాన్‌కు ఇది ఆరో విజయం కాగా కోల్‌కతాకు రెండో పరాభవం. ఈ సీజన్‌లో ఓపెనర్‌గా వస్తూ సంచలన ఇన్నింగ్స్‌లు ఆడుతున్న నరైన్ మరోసారి రెచ్చిపోయాడు. ఆరంభంలో నెమ్మదిగానే ఆడిన నరైన్ ఆరో ఓవర్ నుంచి జోరు పెంచాడు. గత మ్యాచ్‌లో రాణించిన ఫిల్ సాల్ట్ (10) విఫలమైనా అంగ్‌క్రిష్ రఘువంశీ (18 బంతుల్లో 30, 5 ఫోర్లు) కలిసి కేకేఆర్ స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. కుల్‌దీప్‌సేన్ ఆరో ఓవర్లో భారీ సిక్సర్‌తో విధ్వంసానికి తెరతీసిన నరైన్.. 30 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేశాడు. రఘువంశీ, శ్రేయస్ అయ్యర్ (11), ఆండ్రీ రస్సెల్ (13) విఫలమైనా నరైన్ మాత్రం ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. అశ్విన్ 12వ ఓవర్లో 6, 4, 4 బాదిన అతడు.. 16వ ఓవర్ వేసిన చాహల్ బౌలింగ్‌లో 6, 4, 6, 4తో 49 బంతుల్లోనే తన కెరీర్‌లో తొలి టీ20 శతకాన్ని నమోదుచేశాడు. ఆఖర్లో రింకూ సింగ్ (9 బంతుల్లో 20 నాటౌట్, 1 ఫోర్, 2 సిక్సర్లు) మెరుపులతో ఆ జట్టు భారీ స్కోరు సాధించింది.

భారీ ఛేదనలో రాజస్థాన్ బ్యాటర్లూ బ్యాట్‌కు పనిచెప్పినా ఎవరూ ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయారు. క్రీజులో ఉన్నంతసేపు జైస్వాల్ (9 బంతులత్లో 19, 3 ఫోర్లు, 1 సిక్స్), రియాన్ పరాగ్ దంచికొట్టారు. కెప్టెన్ శాంసన్ (12) నిరాశపరిచాడు. వైభవ్ అరోరా వేసిన 6వ ఓవర్లో బట్లర్ ఓ సిక్సర్ బాదగా పరాగ్.. 4, 6, 4 తో 23 పరుగులు రాబట్టారు. హర్షిత్ 8వ ఓవర్లో 6,4 కొట్టిన పరాగ్.. అదే ఓవర్లో భారీ షాట్ ఆడి రస్సెల్ చేతికి చిక్కాడు. ధ్రువ్ జురెల్ (2) మరోసారి చేతులెత్తేశాడు. వరుసగా వికెట్లు కోల్పోవడంతో 9వ ఓవర్ నుంచి రాజస్థాన్ స్కోరు వేగం నెమ్మదించింది. 9వ ఓవర్ నుంచి 14 వ ఓవర్ దాకా ఆ జట్టు 30 పరుగులు మాత్రమే చేయగలిగింది.

15వ ఓవర్ తర్వాత బట్లర్ గేర్ మార్చాడు. చక్రవర్తి 15వ ఓవర్లో 4 ఫోర్లు కొట్టగా.. అశ్విన్ (8) స్థానంలో వచ్చిన రోవ్‌మన్ పావెల్ (13 బంతుల్లో 26, 1 ఫోర్, 3 సిక్సర్లు) భారీ షాట్లతో విరుచుకుపడటంతో ఆఖరి 3 ఓవర్లలో ఆ జట్టు విజానికి 46 పరుగులు అవసరమయ్యాయి. పావెల్ నిష్క్రమించినా అవేశ్ ఖాన్ (0 నాటౌట్)ను నాన్ స్ట్రైయికర్ ఎండ్‌లో నిలబెట్టి దంచికొట్టాడు. స్టార్క్ 17వ ఓవర్లో 18 పరుగులు రాబట్టిన బట్లర్.. హర్షిత్ రాణా ఓవర్లో 19 పరుగులు పిండుకోవడంతో పాటు ఈ లీగ్‌లో ఏడో సెంచరీ పూర్తిచేశాడు. వరుణ్ చక్రవర్తి ఆఖరి ఓవర్లో చివరి బంతికి విన్నింగ్ రన్ కొట్టి కేకేఆర్ ఆశలపై నీళ్లు చల్లాడు. నరైన్ శతకం ఐపీఎల్‌లో కేకేఆర్‌కు మూడోవది. ఈ లీగ్ ఆరంభ మ్యాచ్‌లో బ్రెండన్ మెక్‌కల్లమ్.. ఆర్సీబీపై 158 పరుగులు చేయగా గత సీజన్‌లో వెంకటేశ్ అయ్యర్ (104) ముంబైపై సెంచరీ బాదాడు. ఈ మ్యాచ్‌లో సెంచరీ చేయడం ద్వారా బట్లర్ ఐపీఎల్‌లో ఏడో శతకాన్ని పూర్తిచేశాడు. కోహ్లీ (8) అతడి కంటే ముందున్నాడు.

ఐపీఎల్‌లో బౌలర్‌గా వందకు పైగా వికెట్లు తీసి బ్యాటింగ్‌లో సెంచరీ చేసిన తొలి ఆటగాడు సునీల్ నరైన్. 503 మ్యాచ్‌లు ఆడిన అతడికి ఇదే తొలి శతకం. అంతకుముందు అతడి హయ్యెస్ట్ స్కోరు 85 పరుగులు.

**సంక్షిప్త స్కోర్లు :**
కోల్‌కతా : 20 ఓవర్లలో 223/6 (నరైన్ 109, రఘువంశీ 30, అవేశ్ 2/35, కుల్దీప్ 2/46).
రాజస్తాన్: 20 ఓవర్లలో 224/8 (బట్లర్ 107 నాటౌట్, పరాగ్ 34, నరైన్ 2/30, వరుణ్ 2/36)

# 2040 నాటికి రొమ్ము క్యాన్సర్ వల్ల ఏటా పదిలక్షల మంది మరణించే అవకాశం




రొమ్ము క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మహిళల సంఖ్య ఏటా పెరిగిపోతోంది. 2020లో సుమారు 685,000 మంది మహిళలు ఈ వ్యాధితో మరణించారు. వచ్చే పదిహేనేళ్లలో ఈ సంఖ్య భారీగానే పెరిగిపోతుంది. రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్న మహిళల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతూ వస్తోంది. ఇప్పుడు ప్రపంచంలోనే ఎక్కువమందికి సోకుతున్న అత్యంత సాధారణ కార్సినోజెనిక్ వ్యాధిగా మారింది రొమ్ము క్యాన్సర్. ఈ వ్యాధి 2040 నాటికి ఏటా పది లక్షల మంది ప్రాణాలు తీయడానికి కారణం అవుతుంది. కొత్తగా విడుదలైన లాన్సెట్ కమిషన్ ఈ విషయాన్ని బయటపెట్టింది. 2020 ఏడాది చివరిలో చెప్పిన గణాంకాల ప్రకారం ఐదేళ్లలో సుమారు 7.8 మిలియన్ల మంది మహిళలు రొమ్ము క్యాన్సర్ బారిన పడినట్టు గుర్తించారు. అలాగే అదే సంవత్సరం సుమారు 685,000 మంది మహిళలు ఈ వ్యాధితో మరణించారని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా, రొమ్ము క్యాన్సర్ కేసులు 2020 లో 2.3 మిలియన్లు ఉండగా... ఈ సంఖ్య 2040 నాటికి 3 మిలియన్లకు పైగా పెరుగుతాయని కమిషన్ అంచనా వేసింది. 2040 నాటికి ఈ వ్యాధి కారణంగా ఏటా పది లక్షల మరణాలు సంభవిస్తాయని తెలిపింది. ముఖ్యంగా కొన్ని ఆర్థికంగా వెనుకబడిన దేశాల్లో ఈ క్యాన్సర్ కేసులు పెరిగే అవకాశం అధికంగా ఉన్నట్టు గుర్తించింది. మన దేశంలో కూడా ఎంతో మంది మహిళలు ఏటా రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారు. భారత్ లో తమిళనాడు, కర్ణాటక, దిల్లీ, తెలంగాణా రాష్ట్రాలో రొమ్ము క్యాన్సర్ కేసులు అధికంగా బయటపడుతున్నాయి. ఈ విషయాన్ని భారత వైద్య పరిశోధన మండలి చేసిన అధ్యయనంలో బయటపడింది. పట్టణాల్లో జీవించే మహిళలలో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళలే బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఊబకాయం, శారీరక శ్రమ లేకపోవడం, లేటు వయసులో పెళ్లిళ్లు చేసుకోవచ్చు, పిల్లలను లేటుగా కనడం, పిల్లలకు పాలివ్వకపోవడం వంటివి మహిళ్లలో రొమ్ము క్యాన్సర్ రావడానికి కారణం అవుతుంది. ప్రతి మహిళ రొమ్ము క్యాన్సర్ లక్షణాలను తెలుసుకోవాలి. దీని వల్ల ముందుగానే ఈ క్యాన్సర్ గుర్తించవచ్చు. అండర్ ఆర్మ్ ప్రాంతంలో లోపల ముద్దలా గడ్డ కట్టినట్టు చేతికి తగులుతుంది. ఇది రొమ్ము క్యాన్సర్ కు సంకేతం. అలాగే రొమ్ము పరిమాణం మారినా, సున్నితంగా మారినా, ఆకారం మారినా వెంటనే వైద్యులను కలవాలి. చనుమొనల నుంచి స్రావం కారుతున్నా, వాటి రంగు మారినా, వారి పరిమాణం పెరిగినా కూడా రొమ్ము క్యాన్సర్ వచ్చిందేమో అనుమానించాలి. రొమ్ముల్లో నొప్పి రావడం, గడ్డల్లాంటివి తగిలినా కూడా జాగ్రత్తగా ఉండాలి. రొమ్ము క్యాన్సర్ బారిన పడే అవకాశం యాభై ఏళ్ల వయసులో కంటే తక్కువ వయసున్న మహిళల్లోనే కనిపిస్తోంది. యువతో క్యాన్సర్ విపరీతంగా వ్యాప్తి చెందుతోంది. దీనికి కారణం వారు తినే అనారోగ్యకర ఆహారం, చెడు జీవన శైలి, ధూమపానం, మద్యపానం వంటివి. ఊబకాయం వల్ల కూడా క్యాన్సర్ బారిన పడుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంది. క్యాన్సర్ తొలిదశలోనే గుర్తిస్తే ప్రాణాంతకం కాకుండా ముందే కాపాడుకోవచ్చు. ప్రస్తుతం క్యాన్సర్ ను నివారించే చికిత్సలు, సర్జరీలు అమల్లోకి వచ్చాయి. ప్రాథమిక దశలోనే క్యాన్సర్ ను గుర్తిస్తే ప్రాణం పోకుండా రక్షించుకోవచ్చు.






# చీరలో టిల్లు బ్యూటీ

హీరోయిన్ నేహా శెట్టి.. చీరలో అందాల మెరుపులు మెరిపించారు. లేటెస్ట్ ఫొటోషూట్‌లో గ్లామరస్‌గా అదరగొట్టారు. ఆ ఫొటోలు ఇక్కడ చూడండి. టాలీవుడ్ హీరోయన్ నేహా శెట్టి ఎలాంటి ఔట్‌ఫిట్‌లో అయినా స్టైలిష్‌గా, గ్లామరస్‌గా మెప్పిస్తారు. తాజాగా చీరలో కట్టులోనూ అదరగొట్టారు. గ్రీన్, సిల్వర్ కలర్ షేడ్స్ ఉన్న చీరలో మరింత అందంగా మెరిపించారు నేహా శెట్టి. హాట్ లుక్‌తో మైమరిపించారు. చీరకు మ్యాచ్ అయ్యేలా గ్రీన్ కలర్ స్లీవ్ లెస్, డీప్‌నెక్ బ్లౌజ్ ధరించారు నేహా. ఈ అట్రాక్టివ్ ఔట్‌ఫిట్‌లో కెమెరాలకు స్టన్నింగ్ పోజులు ఇచ్చారు నేహా శెట్టి. ఈ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. 'హే సిరి.. ప్లే దేశీ గర్ల్' అంటూ ఈ బ్యూటీ క్యాప్షన్ రాశారు. మహబూబా (2018) చిత్రంతో టాలీవుడ్‌లో అడుగుపెట్టారు నేహా శెట్టి. గల్లీ రౌడీ, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ చిత్రాల్లో నటించినా.. డీజే టిల్లుతోనే ఈ భామ పాపులర్ అయ్యారు. రాధికగా ఫేమస్ అయ్యారు. నేహా నటించిన బెదురులంక, రూల్స్ రంజన్ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మెప్పించలేకపోయాయి. ఇటీవల టిల్లు స్క్వేర్ మూవీలో క్యామియో రోల్‌లో కాసేపు కనిపించారు నేహా. ప్రస్తుతం విశ్వక్‌సేన్‌తో గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు.





# 'అఖండ – 2' సన్నాహాలు మొదలయ్యాయి

బాలకృష్ణ షూటింగ్‌లకు బ్రేక్ ఇచ్చి రాజకీయ ప్రచారంలో బిజీగా ఉన్నారు. ఎన్నికల వేడి తగ్గాక కె.ఎస్.రవీంద్ర (బాబీ) సినిమా షూటింగ్‌లో పాల్గొంటారు. ఇదిలావుంటే.. బాలయ్య నెక్ట్స్ సినిమాపై రకరకాల వార్తలు వినిపిస్తున్నాయి. బోయపాటి దర్శకత్వంలోనే బాలయ్య ఓ పొలిటికల్ సినిమా చేయనున్నట్టు కూడా ఓ వార్త ప్రస్తుతం మీడియా సర్కిల్‌లో వినిపిస్తున్నది. అయితే.. ఆ వార్తలన్నింటికీ చెక్ పెడుతూ దర్శకుడు బోయపాటి.. క్లియర్ అప్‌డేట్ ఇచ్చేశారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ 'ఎన్నికలు అయిపోయిన తర్వాత 'అఖండ 2'పై అధికారిక ప్రకటన ఉంటుంది. దైవభక్తి మన జీవితంలో భాగం. దాన్ని తెరపై జనానికి నచ్చేలా చూపిస్తే తప్పక ఆదరణ లభిస్తుంది అనడానికి 'అఖండ' ఓ నిదర్శనం. పసిబిడ్డ.. పకృతి.. పరమాత్మ నేపథ్యంలో 'అఖండ' తీశాం. సీక్వెల్‌లో వీటితో పాటు సమాజానికి కావాల్సిన ఓ మంచి విషయం కూడా ఉంటుంది. ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ కూడా మొదలైంది' అని తెలిపారు. అంటే.. మరోసారి 'అఖండ'గా బాలయ్య విశ్వరూపం చూడబోతున్నామన్నమాట.




# నితిన్‌కి జోడీగా

ఒకప్పుడు తెలుగులో అగ్ర కథానాయికల్లో ఒకరిగా గుర్తింపు తెచ్చుకుంది పంజాబీ సోయగం రాశీఖన్నా. 'థాంక్యూ' సినిమా తర్వాత తెలుగులో ఏ చిత్రానికి అంగీకరించలేదు. ప్రస్తుతం టాలీవుడ్‌లో పూర్వ వైభవాన్ని సంపాదించుకునే ప్రయత్నాల్లో ఉందీ భామ. తాజా సమాచారం ప్రకారం ఈ అమ్మడు తెలుగులో నితిన్‌తో ఓ సినిమా చేయబోతున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. నితిన్ హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో 'రాబిన్‌హుడ్' పేరుతో సినిమా తెరకెక్కుతున్నది. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్నది. ఈ సినిమాలో రాశీఖన్నాను నాయికగా ఖరారు చేసినట్లు సమాచారం. గతంలో ఈ జంట 'శ్రీనివాస కల్యాణం' చిత్రంలో నటించారు. సుదీర్ఘ విరామం తర్వాత మరోసారి ఈ జోడీ వెండితెరపై సందడి చేయడానికి సిద్ధమవుతున్నది. రాశీఖన్నా నటించిన తమిళ చిత్రం 'అరణ్మనై 4'...'బాక్' పేరుతో ఈ నెల 26న ప్రేక్షకుల ముందుకురానుంది.

# థ్రిల్‌ను పంచే కిడ్నాప్ డ్రామా

చైతన్యరావు, సునీల్, శ్రద్ధాదాస్, మాళవిక సతీశన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'పారిజాత పర్వం'. 'కిడ్నాప్ ఈజ్ ఆన్ ఆర్ట్' ఉపశీర్షిక. సంతోష్ కంభంపాటి దర్శకత్వంలో మహీధర్ రెడ్డి, దేవేష్ నిర్మించారు. ఈ నెల 19న విడుదలకానుంది. సోమవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. దర్శకుడు మాట్లాడుతూ 'డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తీసిన కిడ్నాప్ డ్రామా ఇది. ఆద్యంతం వినోదంతో పాటు ఉత్కంఠను పంచుతుంది' అన్నారు. 'ఇది పూర్తిగా కాన్సెప్ట్ బేస్డ్ ఫిల్మ్. దీనికి సీక్వెల్ కూడా ఉంది' అని హీరో చైతన్య రావు తెలిపారు. వినూత్నమైన కాన్సెప్ట్ ఇదని నిర్మాత మహీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: బాల సరస్వతి, సంగీతం: రీ, రచనదర్శకత్వం: సంతోష్ కంభంపాటి.





# ముంబైలో ల్యాండైన భీమ్లానాయక్ భామ

భీమ్లానాయక్ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది మాలీవుడ్ భామ సంయుక్తా మీనన్. ఈ మూవీ సక్సెస్ తర్వాత వరుస ఆఫర్లతో ఫుల్ బిజీ హీరోయిన్‌గా మారిపోయింది. సార్, బింబిసార, డెవిల్ సినిమాలతో మంచి హిట్స్‌ను ఖాతాలో వేసుకుంది. ప్రస్తుతం తెలుగులో ఓ సినిమా షూటింగ్‌తో బిజీగా ఉన్న ఈ భామకు సంబంధించిన వార్త ఒకటి నెట్టింట రౌండప్ చేస్తోందిఇప్పటివరకు తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో సినిమాలు చేస్తూ వస్తోన్న ఈ భామ ఇక హిందీపై ఫోకస్ పెట్టబోతుందట. ఇక సంయుక్తామీనన్ బాలీవుడ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అయింది. ఈ భామ నేడు కాస్టింగ్ డైరెక్టర్ కార్తీక్ పెరుదు, మేకప్ ఆర్టిస్ సాధ్నా సింగ్‌తో కలిసి ముంబైలోని బాంద్రాలో ఉన్న మెహబూబ్ స్టూడియోలో ల్యాండ్ అయింది. సంయుక్తామీనన్ సూపర్ బాలీవుడ్ ప్రాజెక్ట్‌లో నటించే అవకాశం కొట్టేస్తుందని తెలుస్తోండగా.. త్వరలోనే డెవిల్ భామ నటించే సినిమా వివరాలపై క్లారిటీ రానున్నట్టు బీటౌన్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. సంయుక్తామీనన్ ప్రస్తుతం నిఖిల్ సిద్ధార్థ్ నటిస్తోన్ స్వయంభులో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com